క్లుప్తంగా

దేవాలయ అభివృద్ధికి విరాళం



మాజీ ఎమ్మెల్యేకు విరాళం అందజేస్తున్న సురేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి మాజీ వార్డుసభ్యుడు బెంది సురేందర్‌రెడ్డి, బెంది సుదర్శన్‌రెడ్డిలు శనివారం రూ.1లక్షా 1వేయి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలుకు వారు విరాళం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, కుమార్‌గౌడ్, అప్పి, భూపాల్, అన్మారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



గుంతల్లో మొరం పోయించి పూడుస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: మొయినాబాద్ నుంచి శ్రీరాంనగర్‌కు వెళ్లే రోడ్డు సురంగల్ గ్రామం వరకు కాస్త బాగున్నా అక్కడి నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరం పూర్తిగా గుంతలమయంగా మారింది. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉండగా ప్రస్తుతం ముసురు వర్షాలకు గుంతల పెద్దగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. రోడ్డు అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా లాభం లేదని భావించి శనివారం గ్రామానికి చెందిన యువకులు, గ్రామస్తులు మొరం తెప్పించి గుంతలు పూడ్చి రోడ్డును తాత్కాలికంగా బాగుచేసుకున్నారు.

ఫిరంగి కాల్వకు మరమ్మతులు



ప్రొక్లెయినర్‌తో కాల్వకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

శంకర్‌పల్లి: ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని మోకిల వద్ద ఫిరంగి కాల్వ గండి పడడంతో పొలాల గుండా నీరు ప్రవహించి రైతులు పెద్దఎత్తున నష్టపోయిన విషయం తెలిసిందే. అయితే ఆ నష్టాన్ని పూడ్చేందుకు నీటి పారుదల అధికారులు ఆలస్యంగా స్పందించారు. గండి పడి వారం రోజులు గడుస్తుంటే అధికారులు వర్షం కారణంగా మరమ్మతులు చేయలేదని చెబుతూ శనివారం ప్రొక్లెయినర్ సాయంతో గండికి మరమ్మతుల పనులు చేపట్టారు. ఇప్పటికైనా స్పందించి, పనులు ప్రారంభించినందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కంటి వైద్య శిబిరం



వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

షాద్‌నగర్: పట్టణంలోని నవోదయ వృద్ధాశ్రమంలో శనివారం భవానీ కంటి ఆస్పత్రి, షాద్‌నగర్ లయన్స్ క్లబ్, బేరా సొసైటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ డాక్టర్ రెడ్యానాయక్ వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు సందీప్, లయన్స్ క్లబ్, బేరా ట్రస్టు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీఓగా హన్మంతురెడ్డి

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల పంచాయతీ అధికారిగా హన్మంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఎంపీఓగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ పాల్ కడ్తాల్ ఎంపీఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో షాబాద్ ఎంపీఓగా పనిచేస్తున్న హన్మంత్‌రెడ్డి జిల్లేడ్ చౌదరిగూడలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీనిచ్చారు.

విద్యుత్‌తో జరభద్రం!

- వానకాలంలో పొంచి ఉన్న ప్రమాదాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న విద్యుత్‌శాఖ అధికారులు
- సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచన



షాద్‌నగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్

షాద్‌నగర్: వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పరికరాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. అప్రమత్తంగా ఉంటే విద్యుత్ ప్రమాదాలు నిరోధించొచ్చు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో భూమి పూర్తిగా తడిపోయింది. దీనికి తోడు గాలి దుమారంతో విద్యుత్ తీగలు తెగిపడుతున్నాయి. నిర్లక్ష్యంగా ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రమాదాల నివారణకు విద్యుత్ అధికారులు ఇస్తున్న తగిన సలహాలు సూచనలు ఇవి.

విద్యుత్ స్తంభాలతో జాగ్రత్త

వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలకు కూడా కరెంటు ప్రవహిస్తుంది. వ్యవసాయ బావుల వద్ద, గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన స్తంభాలకు దూరం ఉండాలి. చిన్న పిల్లలను వీటి వద్దకు వెళ్లనీయొద్దు. ఇళ్లలో కూడా తడి చేతులతో స్విచ్‌లు వేయొద్దు. తడి గోడలను ముట్టుకోవడం మంచిది కాదు. ఉతికిన దుస్తులు ఆరవేయడానికి మహిళలు ఇంట్లో తీగలు ఏర్పాటు చేసుకుంటారు. ఇవి విద్యుత్ వైర్లకు తాకకుండా చర్యలు తీసుకోవాలి. ఇళ్లపై నుంచి హైటెక్షన్ వైర్లు ఉన్నట్లయితే వర్షం కురుస్తున్నప్పుడు ఇంటిపైకి ఎక్కకపోవడం మంచిది.

తడి చేయితో స్విచ్‌లు వేయొద్దు

టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, గ్రైండర్లు, మిక్సీలు, వాడేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. తడి చేయితో వీటి స్విచ్‌లు వేయొద్దు. అసెంబుల్ ఉపకరణాలు ఉపయోగించే కంటే బ్రాండెడ్ పరికరాలు వాడితే మంచిది. సెల్‌ఫోన్‌లు చార్జింగ్ పెట్టే సమయంలో జాగ్రత్తగా ఉండాలి.

ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి

వర్షాలు కురుస్తున్నప్పుడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు చాలా దూరంగా ఉండాలి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయలేదు. దీంతో వాటి పక్క నుంచి నడిచినా విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. చాలా పశువులు రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాతపడ్డాయి. ఈదురుగాలులు వీచినప్పుడు కూడా తీగలు తెగిపోయి మీద పడే అవకాశాలు ఉన్నాయి.

సమాచారం ఇస్తే మేలు

ట్రాన్స్‌ఫార్మర్లలో మంటలు రావడం, విద్యుత్ తీగలు తెగిపోవడం వర్షాకాలంలో జరుగుతుంటాయి. కొన్నిచోట్ల రైతులే మరమ్మతులు చేస్తుంటారు. ఇలా చేయడం సరికాదు. ఎట్టి పరిస్థితుల్లో ఇలాంటి పనులు చేయొద్దు. విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే విద్యుత్‌శాఖా అధికారులకు సమాచారం ఇవ్వాలి. విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంటూ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

వ్యవసాయ బావుల వద్ద

వర్షాకాలంలో బోరుమోటార్లు వేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. స్టార్టర్ వద్ద తీగలు సరి చూసుకోవాలి. తెగిపోయి వేలాడే తీగలను ముందే గుర్తించాలి. ఒక్కోసారి విద్యుత్ తీగలు తెగిపోయి ఉంటాయి. వీటిని ముట్టినప్పుడు షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. స్టార్టర్ డబ్బాలను సురక్షిత ప్రాంతాల్లో అమర్చుకోవాలి. స్టార్టర్ వద్దకు వెళ్లేటప్పుడు చెప్పులు, చేతికి తొడుగులు ధరించాలి. అవి పాడైతే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటుగా మెకానిక్‌లకు చూపించాలి.

సర్వీస్ వైర్లను తాకొద్దు



వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ స్తంభాలు, తడిగా ఉన్న గోడలు, సర్వీసు వైర్లను ఎవరూ తాకొద్దు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే వెంటనే తమకు సమాచారం అందించాలి.

– వినోద్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ, షాద్‌నగర్‌టౌన్

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వామివారికి పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకిసేవ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. అందరూ భక్తి మార్గంలో పయనించాలని సూచించారు. అనంతరం దేవాలయ భజన భక్త బృందం సభ్యుడు నవీన్ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాణిక్యం, పురుషోత్తంగౌడ్, లాస్య, శేఖర్, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

ఎంపీడీఓ అపర్ణ



వనమహోత్సవంలో పాల్గొన్న ఎంపీడీఓ అపర్ణ, ఏపీఓ వీరాసింగ్

షాబాద్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణకు కృషి చేయాలని ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని, మానవాళి మనుగడకు మొక్కల పెంపకం ఎంతో అవసరమన్నారు. వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ ఉద్యమస్ఫూర్తితో మొక్కలను నాటాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ వీరాసింగ్, హెచ్‌ఎం యామిని, పంచాయతీ కార్యదర్శి అనిత, పోనమోని రమేశ్‌యాదవ్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నేతల ప్రచారాలు సరికాదు

కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ జిల్లా చైర్మన్ శ్రీనునాయక్

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ నేతలు అసత్యపు ప్రచారాలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ జిల్లా చైర్మన్ శ్రీనునాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎంతో మంది గిరిజన రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఏ ఒక్కరోజు కూడా బాధిత కుటుంబాల గురించి మాట్లాడలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన ఆరునెలల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి అనేక పథకాలను రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నారని, రాష్ట్రాభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్‌ఎస్ నేతలు అబద్ధపు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు తేడా చూసుకోవాలన్నారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అందుకే బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. సమావేశంలో నాయకులు గణేశ్ నాయక్, నారాయణనాయక్, బాలునాయక్, రాజునాయక్, వినోద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘సీజనల్’ అప్రమత్తత తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

శంకర్‌పల్లి: వర్షాకాలం దృష్ట్యా మున్సిపల్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో పలు విభాగాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో ఖాళీ స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటాలని తెలిపారు. శునకాల బెడద ఎక్కువైందని బ్లూక్రాస్ సొసైటీతో ఎంవోయూ చేసుకొని వాటికి ఇంజక్షన్లు ఇచ్చి, మరోచోటకి తరలిస్తామన్నారు. డ్వాక్రా సంఘాల మహిళల కోసం మహిళా శక్తి పథకం అమలు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై సిబ్బంది, మెప్మా, ఆర్పీలకు పలు సూచనలు చేశారు. రానున్న మూడునెలలు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో మేనేజర్ అంజన్‌కుమార్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది

చేవెళ్ల: విద్యార్థులు చదువుతో పాటు సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంపొందించుకునేలా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం ఎండీ ఇలియాస్ అన్నారు. మండలంలోని ఊరేళ్ల ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షా సప్తహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మొక్కలు నాటించి వాటిని సంరక్షించుకునే బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడురోజుల పాటు రోజుకో కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు మంచి అలవాట్లు నేర్చుకోవాలని, మంచి ఆలోచనలతో భవిష్యత్‌ను గొప్పగా చేసుకునేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, ప్రకాశ్‌రెడ్డి, చాముండేశ్వరి, నర్మదా, విద్యార్థులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బాల్‌రాజ్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సిర్సనోళ్ళ బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఎంతోకాలంగా పోరాటం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ సాధనకు ఈనెల 6, 7 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జాంగారి రవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కేశంపేట: చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్య అన్నారు. మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం బాల్య సంరక్షణ, విద్య (ఇసీసీఇ) దినోత్సవాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల తల్లిదండ్రులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అంకెలు, ఇంగ్లిష్‌లో చిన్న చిన్న పదాలను తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్, అంగన్‌వాడీ టీచర్ జయమ్మ పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది, ప్రజాప్రతినిధులు

షాబాద్: సమాజాభివృద్ధిలో ఉపాధ్యా వృత్తి కీలక భూమిక పోషిస్తుందని పోతుగల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజ్‌పాల్‌సింగ్, పీఆర్టీయూ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ పేర్కొన్నారు. శనివారం పోతుగల్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు బి. విఠల్, సరిత, రవీందర్, చంద్రశేఖర్, వై.విఠల్, అంజయ్య, జయవాణిలను మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు, డీసీసీ ప్రధాన కార్యదర్శి భార్గవ్‌రామ్, మాజీ-కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆయూబ్, మాజీ సర్పంచ్ కేతవత్ రవీందర్‌నాయక్, శ్రీనివాస్, పీరంపల్లి యాదయ్యలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ మహేందర్ ముదిరాజ్



నర్సింహారావును సన్మానిస్తున్న మహేందర్, తిరుపతి

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ ఉద్యోగులు కష్టపడి పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఫిషర్‌మెన్ చైర్మన్ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్, రాష్ట్ర వార్డుసభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి తిరుపతిరెడ్డిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని బాకారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన నర్సింహారావు పదవీ విరమణ కావడంతో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వార్డుసభ్యులు తిరుపతిరెడ్డి, సువర్ణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు జగదీశ్‌చంద్ర, నర్సింలు, నర్సింహ్మం, పద్మ, భగీరథ, సునంద, జుబేనాబేగం, శివయ్య, మాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతిబింబాలు పౌరాణిక నాటకాలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

షాద్‌నగర్: పౌరాణిక నాటకాలు సంస్కృతికి ప్రతిబింబాలని, ప్రాచీన కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గణేశ్ గార్డెన్‌లో శ్రీవాణి సంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పౌరాణిక నాటక పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి బండారి రమేశ్, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు చెంది మహేందర్‌రెడ్డిలు హాజయ్యారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కళలను, కళాకారులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు అందరినీ ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్యాయాదవ్, మాజీ జెడ్పీటీసీ వెంకట్రామిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రంగనాథం పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవు



గురుకుల పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

కొందుర్గు: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని కొందుర్గు ప్రాథమిక ఆరోగ కేంద్రం సూపర్‌వైజర్ లుదియా సూచించారు. శనివారం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, కేజీబీవీలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య సలహాలు ఇవ్వడంతో పాటు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. అదే విధంగా వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టిపెట్టాలని సూచించారు. విద్యార్థులు చేతివేళ్ల గోర్లను ఎప్పటికప్పుడూ కత్తిరించుకోవాలని తెలిపారు. భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుగుకోవాలని, సాధ్యమైనంత వరకు వేడిపదార్థాలను తినాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్



ముట్పూర్‌లో సభ్యత్వ నమోదు చేపడుతున్న ఉపాధ్యాయులు

కొందుర్గు: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు. పీఆర్టీయూ సభ్యత్వ నమోదు వారోత్సవాల్లో భాగంగా కొందుర్గు, ముట్పూర్ పాఠశాలల్లో ఉపాధ్యాయులను సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించి 50 శాతం పీఆర్సీ, ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు నర్సింలు, సురేశ్ కుమార్, నాజర్ అలీ, రాంరెడ్డి, జంగయ్య, బాల్‌రాజ్, వెంకట్‌రావు పాల్గొన్నారు.

తప్పుడు విమర్శలు చేస్తే సహించం



మాట్లాడుతున్న భీష్వరామకృష్ణ

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులకు పూర్తిగా సహకరిస్తామని, తప్పుడు విమర్శలు చేస్తే సహించేదిలేదని మాజీ ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు భీష్వరామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భీష్వరామకృష్ణ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను గత ప్రభుత్వం ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న తప్పుడు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఎంతో కష్టపడి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడంతో పాటుగా వాటి ప్రొసీడింగ్‌లను తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారన్నారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓడిపోవడంతో బిల్లులు నిలిచిపోయాయని, ఓడిపోయిన ఎమ్మెల్యే ఏ విధంగా బిల్లులు ఇస్తారని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మినర్సింహ్మారెడ్డి, జూపల్లిశంకర్, చెట్ల నర్సింలు, పల్లిశేఖర్ పాల్గొన్నారు.

బస్సు పునఃరుద్ధరించాలని వినతి

చేవెళ్ల: మండలంలోని ఆలూరు-దుద్గాగు గ్రామాలకు వచ్చే నైట్ అల్ట్ బస్సు 10 రోజులుగా రావటం లేదని, దీనిని తిరిగి పునఃరుద్ధరించాలని గ్రామ నాయకులు ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరారు. శనివారం మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ మూర్తిని ఆలూరు గ్రామ నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యురాలు యాదమ్మ ఆధ్వర్యంలో కలిసి నైట్ అల్ట్ బస్సును కొనసాగించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మేనేజర్‌ను కలిసి తమ గ్రామానికి మెహిదీపట్నం డిపోకు చెందిన బస్సు నైట్ అల్ట్‌గా దుద్గాగు గ్రామంలో ఉండి ఆలూరు గ్రామం నుంచి వెళ్లేదని చెప్పారు. అయితే పదిరోజుల నుంచి ఈ బస్సు సర్వీస్‌ను నిలిపివేశారని దీంతో ఈ బస్సునే నమ్ముకొని వెళ్లే మా గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఈ బస్సును తిరిగి పునఃరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గోపులారం అశోక్, శ్రీనివాస్, భీమేశ్, కమ్మరి మోహన్, బాల్‌రాజ్, విజయ్ తదితరులు ఉన్నారు.